క్లుప్తంగా

గీత కార్మికుడికి గాయాలు

ఐనవోలు : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని నందనం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నందనం గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మీనారాయణ కుల వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో ఆయన నడుము, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు గమనించి ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పీసీబీ అధికారి విచారణ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన పురాణం రమేష్ ఇంట్లో పవర్ లూమ్స్ నడిచినప్పుడల్లా శబ్దాలు భరించలేకపోతున్నామంటూ రమేష్ అనేక వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేయగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) ఏఈ సుభాష్ సోమవారం విచారణ చేపట్టారు. పొల్యూషన్ డెసిబుల్ యంత్రంతో శబ్ద వాల్యూమ్‌ను పరీక్షించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఏఈ వెల్లడించారు. విచారణలో ఎంపీఓ రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దుబాసి కోమల, కొంగరి లక్ష్మీ, చేరాలు, శాయంపేటకు చెందిన వాసాని సతీశ్, సూరంపేటకు చెందిన బోనపల్లి ఇంద్ర, పెద్ద కోడెపాక గ్రామానికి చెందిన కొయ్యడ నాగరాజు ఇటీవల వేర్వేరు కారణాలతో వేర్వేరు సందర్భాల్లో మృతి చెందగా బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చింతల భాస్కర్, పెద్దకోడెపాకలో అనారోగ్యంతో బాధపడుతున్న ముల్కనూరి నర్సయ్యలను కలిసి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. పేదలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, మండల అధ్యక్షుడు గడ్డం రమేశ్, నాయకులు తాటికొండ రవికిరణ్, ఉప్పు రాజు, చంద్రమౌళి, నవీన్, నాగరాజు, మల్లారెడ్డి, సాంబయ్య, సుధాకర్, సురేశ్, మహేశ్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు : మేయర్

వరంగల్ అర్బన్ : తాగునీటి పైపులైన్ల లీకేజీలపై నిర్లక్ష్యం తగదని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజినీర్లను హెచ్చరించారు. సోమవారం గ్రేటర్ పరిధిలోని ములుగు రోడ్ జంక్షన్ పెట్రోల్‌పంపు సమీపంలో పైప్‌లైన్ లీకేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లీకేజీలను వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ విజయలక్ష్మీ, సురేందర్, నవ్య శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

తలంబ్రాలకు విశేష స్పందన

హన్మకొండ: భద్రాద్రి సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చిందని ఆర్టీసీ కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం కేశరాజు భానుకిరణ్ తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మందికి పైగా తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకున్నారని తెలిపారు. మొదటి విడతలో 50 వేల మంది భక్తులకు ఈ నెల 2న తలంబ్రాలు హోం డెలివరీ చేశామని తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఈ నెల 10 వరకు వరకు పొడిగించి నట్లు తెలిపారు. భక్తులు రూ.116 చెల్లించి బుక్ చేసుకోవాలని కోరారు.

భూములను పరిరక్షించాలి

రామన్నపేట : భూకబ్జాదారుల చేతిలో అన్యాక్రాంతమవుతున్న కళాశాల భూములను పరిరక్షించాలని ఎల్‌బీ కళాశాల పూర్వ విద్యార్థులు సోమవారం కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. గతంలో మెయిన్ గేటు వద్ద అక్రమంగా బార్ కన్‌స్ట్రక్షన్ చేసి నడిపిస్తున్నప్పటికీ అధికా రులు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రహరీ కూలగొట్టి ప్రభుత్వం కట్టిన టువంటి నాలాను కూడా కూల్చివేసి లోపలికి చొ చ్చుకు వచ్చి మరీ అక్రమ కట్టడాలు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కళాశాల భూములను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ

వరంగల్ రూరల్: జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారిగా పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అదించారు. జిల్లా దళిత అభివృద్ధి శాఖ జిల్లా అధికారిగా పదోన్నతిపై వరంగల్ జిల్లాకు బదిలీపై వచ్చారు.

‘పది’ పరీక్ష ప్రశాంతం



పరకాలలో



ఎల్కతుర్తి : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

పరకాల : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రశాంతంగా మొదటి పరీక్ష ముగిసినట్టు అధికారులు తెలిపారు. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాలో 458 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. సీఐ పుల్యాల కిషన్, ఎస్సైలు ప్రశాంత్, హరికృష్ణ, శివకృష్ణ బందో బస్తు నిర్వహించారు.

ఐనవోలు : మండలంలోని పంథిని, పున్నేలు, ఐనవోలు జెడ్పీ హైస్కూళ్లలో, పాత్‌ఫౌండర్ స్కూల్‌లో మొత్తం 487 మంది పరీక్ష రాసినట్టు ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్, మోడల్ స్కూళ్లలో 188 మంది పరీక్ష రాశారని స్పెషల్ ఆఫీసర్లు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లోని జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్‌లో 407 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారులు వెల్లడించారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో, ఎంజేపీబీసీ గురుకుల పాఠశాలలో 292 మంది పరీక్ష రాశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సెయింట్ థెరిస్సా స్కూల్‌లో పరీక్షలను ఎంఈఓ రమాదేవి పరిశీలించారు. సీఐ కుమార్, ఎస్సైలు ప్రసాద్, అనిల్ బందోబస్తు నిర్వహించారు.

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రంలో 185 మంది పరీక్ష రాసినట్టు సీఎస్ సారంగపాణి, డీఓ పద్మ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఏసీపీ జూపల్లి శివరామయ్య, సీఐ శ్రీనివాసరావు పరిశీలించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని బాలుర, బాలికల జెడ్పీ హైస్కూళ్లలో 387, ఉప్పల్ జెడ్పీ హైస్కూల్‌లో 132, శనిగరం జెడ్పీ హైస్కూల్‌లో 94 మంది పరీక్ష రాశారని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తును ఇన్‌స్పెక్టర్ సంజీవ్ పర్యవేక్షించారు.



శాయంపేట : తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



కమలాపూర్ : పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఐనవోలు మండలంలోని పున్నేలు సెంటర్ వద్ద..



దామెర : పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ



ఆత్మకూరు : హాల్ టికెట్లతో విద్యార్థినులు

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి

ఐనవోలు : రైతులు మెళకువలు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని ఒంటిమామిడిపల్లి, సింగారం దత్తత గ్రామాల్లో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నువ్వులు, నూనె గింజల పంట పంటల, ఇతర పంటల్లో వివిధ రకాల చీడపీడల ఉధృతిని గమనించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. నువ్వులు ప్రస్తుతం పూత, కాయ దశలో ఉన్న క్రమంలో నీటి తడులు ఇవ్వాలని సూచించారు. ఎండు తెగులు, గొంగళి పురుగుల ఉధృతిని గమనించి తెగులు ఆశించిన మొక్కలను తొలగించి కాల్చేయాలని చెప్పారు. తెగులు, గొంగళి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే రసాయన మందులు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



నువ్వుల పంటను పరిశీలిస్తున్న డాక్టర్ సౌమ్య

అనుబంధ కమిటీలను ఎన్నుకోవాలి

ఐనవోలు : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ బీఆర్‌ఎస్ అనుబంధ కమిటీలను త్వరితగతిన ఎన్నుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని లింగమోరిగూడెం, ఉడుతగూడెం గ్రామాల్లో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశాల్లో శంకర్‌రెడ్డి మాట్లాడారు. యువత, శ్రేణులు ఎమ్మెల్యే రమేశ్ దిశా నిర్దేశం మేరకు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ యువ నాయకత్వం ముందుండాలని కోరారు. సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జెడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ వైస్ చైర్మన్లు చందర్‌రావు, మాదాసు బాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, అధికార ప్రతినిధి మిద్దెపాక రవీందర్, అనుబంధ విభాగాల మండల అధ్యక్షులు సింగారపు భాస్కర్, పల్లకొండ సురేశ్, దుప్పెల్లి కొంరయ్య, జన్నపురెడ్డి దేవికారెడ్డి, మరుపట్ల నరేష్, గూబ అరుణ్‌కుమార్, నందనం సొసైటీ మాజీ చైర్మన్ బుర్ర రాజ్‌కుమార్, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ కట్కూరి రాజు, ప్రచార కార్యదర్శి తాండ్ర కోమలత, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

పరిశుభ్రత పనులు చేయించండి

పరకాల : రంజాన్ సందర్భంగా స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని ఈద్గాల, మసీదుల, ఖబరస్తాన్‌ల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేయించాలని కోరుతూ పట్టణ మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామికి మైనార్టీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఈద్గా, ఖబరస్తాన్‌ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిన క్రమంలో తక్షణమే జంగిల్ కటింగ్, ఇతర పనులు చేయించి ముస్లిముల ఉపవాస దీక్షలు, ప్రార్థనలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు బియాబానీ, కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్ అలీ, నాయకులు ఖాజామొద్దీన్, జియామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

6న గోవిందరాజస్వామి రథోత్సవం

వరంగల్ చౌరస్తా : వరంగల్ నగర నడిబొడ్డును గోవిందాద్రి కొండపై వెలసిన శ్రీ దేవి భూ దేవి నీలా దేవి సమేత గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 6న రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర చాత్తాద శ్రీ వైష్ణవ సంఘ రాష్ట్ర అధ్యక్షులు శ్రీమాన్, అశ్వాపురం వేణు మాధవ, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గంగు ఉపేంద్రశర్మ ముఖ్యఅతిథులుగా హాజరై ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. 5న సాయంత్రం 5 గంటల నుంచి ప్రభబండ్లు తిరుగుట, 6న ఉదయం 5 గంటలకు పెద్దరథ మహోత్సవం పురవీధులగుండా తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, చింతాకుల సునీల్, ఆలయ ఈఓ రత్నాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు గోవిందాద్రి, గోశాల వ్యవస్థాపకులు వరయోగుల లక్ష్మణస్వామి, క్రాంతికుమార్, జగదీశ్వర్, కిరణ్, స్వామి, వేణు మాధవస్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమరాతి సత్యనారాయణ, ఇప్ప ఆదినారాయణ పరిశ శ్రీనివాస్ బండి సుధాకర్, యాదగిరి, దేవేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అర్చకులు

ఛత్రపతి శివాజీ వర్ధంతి



నడికూడ : ఆరె కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వరికెల కిషన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. శివాజీ పాలనలో లౌకికవాదాన్ని పాటించారని, అన్ని మతాల ప్రజలనూ సమానంగా ఆదరించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు లోకేటి నగేష్, నాయకులు వాంకె రాజు, లక్ష్మయ్య, మోర్తాల పున్నంచందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ కోఆర్డినేటర్‌గా సలీం



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ సలీంను బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ మండల కోఆర్డినేటర్‌గా నియమించినట్టు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సలీం విలేకరులతో సోమవారం మాట్లాడారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన క్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి దక్కడంలో సహకరించారంటూ జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సలీంను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



కేడీసీలో శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

విద్యారణ్యపురి: విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావటంతో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి అన్నారు. సోమవారం కేడీసీలోని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిబిరంలో భాగంగా కళాశాలలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కళాశాల ఆవరణలో చెత్తను తొలగించి పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రాంబాబు, సీనియర్ వలంటీర్లు రత్నాకర్, వినయ్,అఖిల్, శ్రావణి, వివేక్, నవీన్ వలంటీర్లు పాల్గొన్నారు.

జనగామ-సికింద్రాబాద్ మధ్య లోకల్ ట్రైన్ నడపాలి

హన్మకొండ : జనగామ-సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మధ్య లోకల్ ట్రైన్ నడపాలని ప్రజలు కోరుతున్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి లేఖ ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు జిల్లా కేంద్రం జనగామ అతి సమీపంగా ఉందని, జనగామతో పాటు ఆలేరు, భువనగిరి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వేలాది మంది నిత్యం హైదరాబాద్‌కు వచ్చివెళ్తుంటారని మంత్రికి వివరించారు. ప్రస్తుతమున్న రైళ్లన్నీ రద్దీతో వెళ్తున్నాయని, నిలబడి ప్రయాణించలేని పరిస్థితులున్నాయన్నారు. ఈ క్రమంలో లోకల్ ట్రైన్ నడిపితే సౌకర్య వంతంగా ఉంటుందని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చించి సాధ్యమైనంత త్వరగా లోకల్ లేదా ఎంఎంటీఎస్ రైల్‌ను మంజూరు చేయాలని కోరారు.

నల్లబ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పరకాల : ఢిల్లీలో న్యాయవాదిని కాల్చి చంపిన ఘటనను నిరసిస్తూ పట్టణంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రమౌళి మాట్లాడారు. కొంతకాలంగా న్యాయవాదులపై రాష్ట్రంలో పలు చోట్ల దాడులు, దౌర్జన్యాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఢిల్లీలో న్యాయవాదిని కాల్చి చంపిన దుండగుడిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలుత న్యాయవాదులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, న్యాయవాదులు ఒంటేరు రాజమౌళి, తడక సురేశ్, దొగ్గెల రమేశ్, పి.వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణించొద్దు

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



కూలీలు, ఆటోడ్రైవర్‌తో మాట్లాడుతున్న జ్యోతి

శాయంపేట : ఆటోల్లో పరిమితికి మించి కూలీలను తీసుకెళ్లొద్దని ఆటోడ్రైవర్లకు వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని వెళ్తుండగా మండల పరిధిలో ఆటోలో పరిమితికి మించి కూలీలతో ప్రయాణిస్తుండగా వాటిని చైర్‌పర్సన్ జ్యోతి ఆపి కూలీలు, ఆటోడ్రైవర్లతో మాట్లాడారు. ఇటీవల పరకాల చలివాగు వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందగా పలువురు గాయాలపాలైన విషయాన్ని గుర్తు చేశారు. పరిమితికి మించి కూలీలను ఆటోల్లో తీసుకెళ్లడం ప్రమాదకరమని స్పష్టం చేశారు. ప్రమాదాల వల్ల పేద కూలీల కుటుంబాలు చితికిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. పరిమితికి మించి కూలీలను ఆటోల్లో తీసుకెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘కంటి వెలుగు’తో పేదలకు ప్రయోజనం

● మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ



ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అనిత రామకృష్ణ

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో పేదలకు లబ్ధి చేకూరుతోందని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని శిశుమందిర్ స్కూల్‌లో కౌన్సిలర్ మార్క ఉమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని చైర్‌పర్సన్ అనిత సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు, ప్రధానంగా పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు కళ్లద్దాలు అందించడానికి ప్రభుత్వం నిర్ణయించి కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్స సైతం చేస్తారని చెప్పారు. ఈనెల 6 వరకు కొనసాగనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బియాబానీ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులను వినియోగించుకోండి



కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఓ రవి

శాయంపేట : గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు కలిగిన కూలీలు వినియోగించుకోవాలని అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి కోరారు. మండలంలోని తహరాపూర్, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రతిరోజూ 50 మందికి తక్కువ కాకుండా కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ప్రభుత్వం కూలి పెంచిందని, ఎండాకాలం నేపథ్యంలో ఉదయం వేళల్లో పని చేసుకోవాలని చెప్పారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం పత్తిపాక, తహరాపూర్, కొత్తగట్టు సింగారం గ్రామాల్లోని నర్సరీలను అదనపు డీఆర్డీఓ పరిశీలించారు. వాచార్‌తో మొక్కలకు నీళ్లు పట్టించాలని నిర్వాహకులకు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ కీర్తి అనిత, టెక్నికల్ అసిస్టెంట్ గౌతమ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పార్టీ గెలుపే లక్ష్యం

● బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్



మాట్లాడుతున్న మురళీధర్‌గౌడ్

పరకాల : రానున్న ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షతన పరకాల, నడికూడ మండలాల శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా నక్సలైట్లకు సైతం భయపడకుండా ముందుకు సాగిన త్యాగమూర్తుల స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. పార్టీకి పరకాల పుట్టినిల్లు వంటిదన్నారు. పోరాటాల గడ్డగా గుర్తింపు పొందిన పరకాల నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా జయపాల్ గెలిచి ప్రజాసంక్షేమానికి బాటలు వేశారని గుర్తు చేశారు. ఎంపీగా చందుపట్ల జంగారెడ్డి సైతం పార్టీకి జీవం పోశారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకమౌతూ సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా బాటలు వేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, గొర్రెల కాపరుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీరు, పరకాల, నడికూడ మండలాల అధ్యక్షులు పుట్ట రవీందర్, గోగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.